క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

గూడూరు: ప్రతీ ఒక్కరూ పదో తరగతి పరీక్షల్లో 'ఏ' గ్రేడ్ సాధించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్ అన్నారు. మండలంలోని పొనుగోడు జెడ్పీహెచ్ఎస్‌లో పది విద్యార్థులకు బుధవారం ఆయన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, రబ్బర్, పెన్సిళ్లు అందించారు. ముత్యం లక్ష్మి, నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ జమీల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

డోర్నకల్ : స్థానిక పంపుబావితండా నుంచి రాజోలు శివారు వరకు చేపట్టిన బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సుభాష్‌వీధిలోని సుభాష్ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఏఈ చైతన్య మాట్లాడుతూ రూ.5 కోట్ల నిధులతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కందుల మధు, ఇంజం కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

తొర్రూరు రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నవయుగ యూత్ అధ్యక్షుడు మార్క ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అమ్మాపురంలో గత నెలరోజులుగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగించారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపును పురస్కరించుకొని నిర్వాహకులు బొమ్మగాని రాధిక, కొత్తూరు సరితలను పూలమాలలు, శాలువాలతో యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు మార్క శ్రీనివాస్, మాచర్ల అరవింద్, గుంటుక వెంకటేష్, కరుణాకర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చర్యలు చేపట్టాలి

డోర్నకల్ : పత్తిలో పచ్చ, తెల్ల దోమ నివారణకు రైతులు సరైన చర్యలు చేపట్టాలని మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శోభన్ బాబు సూచించారు. డోర్నకల్ శివారు ఎర్రమట్టితండాలో బానోత్ చంద్యా సాగుచేస్తున్న పత్తిపంటను బుధవారం ఏడీఏతో పాటు మండల వ్యవసాయ అధికారి కె.రామారావు, సహాయ విస్తరణ అధికారులు ఎర్ర కర్ణ, అవినాష్, చరణ్‌తేజ్ తదితరులు పరిశీలించారు.

వసతిగృహాల తనిఖీ

గార్ల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఎంపీడీఓ జి.రవీందర్ బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో బియ్యం స్టాక్, మెనూ వంటకాలు, విద్యార్థుల స్టడీ అవర్, బాత్‌రూమ్‌లు, రికార్డులను ఆయన పరిశీలించారు. వార్డెన్ వీరన్న ఉన్నారు.

దంతాలపల్లి : మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, పెద్దముప్పారం ఎస్సీ బాలుర వసతి గృహాలను బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వసతిగృహంలో ఉంటున్న బాలురను వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట మండల పంచాయితీ అధికారి అప్సర్‌పాషా, ఉన్నారు.

ఘన సన్మానం

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నెలో మ్యూజిక్ డైరెక్టర్ బోలే షావలిని బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభకు కొదవలేదని, ఎంతోమంది కళాకారులకు అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, అంబాల మురళీ, శ్రీనివాస్‌నాయక్, ముత్తయ్య, రాజు, యాకాంబ్రం, వెంకన్న పాల్గొన్నారు.

ఏప్రిల్ 9న ధూం..ధాం

బయ్యారం : ఏప్రిల్ 9న బయ్యారంలోని గాంధీసెంటర్‌లో జమిలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మహా ధూం...ధాం నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ లింగాల వెంకన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ధూం..ధాం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జగ్గ తండా సర్పంచ్ రమేష్, గాయకులు, కుమారస్వామి, వెంకన్న, కులసంఘాల నాయకులు భాస్కర్, గోవర్ధన్, రామారావు, రాజేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు తండాలకు మహర్దశ



గార్ల : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలు, తండాలకు మహర్దశ వచ్చిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ భూక్యా భారతి అన్నారు. బుధవారం మండలంలోని గోపాలపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజకుమారి, సర్పంచ్ ఎస్.జ్యోతి నర్సింహ, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో : కళాశాలను సందర్శిస్తున్న తహసీల్దార్



కురవి/బయ్యారం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది



కొత్తగూడ : పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

గూడూరు, కురవి, కొత్తగూడ, డోర్నకల్, గార్ల, మరిపెడ, కేసముద్రం, బయ్యారం మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల్లో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు



డోర్నకల్ : పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న బాలికలు



గార్ల : పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ..



మరిపెడ : సమయానికి ముందే సెంటర్ వద్దకు చేరుకున్న విద్యార్థులు

ఘనంగా మహిళా శిశుమాసోత్సవాలు

కురవి: మండలంలోని రాజోలు, బలపాల, సూదనపల్లి గ్రామాల్లో అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని మానుకోట మహిళా శిశు మాసోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. రాజోలులోని జీపీ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో సర్పంచ్ ఎస్కె మస్తాన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, రామానుజమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు. బలపాలలో సర్పంచ్ ముండ్ల ప్రమీల ఎంపీటీసీ పిట్టల రమణ, ఏఎన్ఎం లక్ష్మీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. లింగ్యాతండాలో సర్పంచ్ గుగులోత్ రాంలాల్, స్కూల్ టీచర్ వీరన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. సూదనపల్లిలో సూపర్‌వైజర్ వహీదున్నీసా బేగం, సర్పంచ్ దుస్స పూలమ్మ, ఎంపీటీసీ అడిదెల దేవేందర్, పాఠశాల హెచ్ఎం ధరావత్ వెంకన్న, ఏఎన్ఎం భాగ్యమ్మ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు

మరిపెడ రూరల్: చిరుధాన్యాల వినియోగంతో సమృద్ధిగా పోషక విలువలు లభిస్తాయని స్థానిక ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. లచ్చతండ, పురుషోత్తమాయగూడెం, అబ్బాయిపాలెం సెక్టార్లలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శిశు మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీపీ మాట్లాడుతూ మనం తినే ఆహారంలో రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, అరికెలు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. సర్పంచ్ బానోతు బిక్కునాయక్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కళ్యాణి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్ : ఆరోగ్యంపై గర్భిణీ, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి అన్నారు. బుధవారం మండలంలోని ఫత్తేపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళ, శిశు మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలగం సునిత, సర్పంచ్ గూడెల్లి సోమనర్సమ్మ, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, అంగన్‌వాడి టీచర్స్ శైలాజ, పద్మ, ప్రేమసుధ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చేయూతనందించాలి



తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బిడ్డల అభివృద్ధికి చేయూతనందించాలని తొర్రూరు వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల అధ్యక్షులు వజినెపల్లి అనిల్ కుమార్, వజినెపల్లి దీపలు అన్నారు. స్థానికులు వేమిశెట్టి జగదీష్, లత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరుక్లబ్‌ల ప్ర ధాన కార్యదర్శులు నవీన్‌కుమార్, నీలిమ, ప్రతి నిధులు మహేష్,గీత, అనిల్,కుమారస్వామి, రాము, ఇన్‌చార్జ్ హెచ్ఎం రవికుమార్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

డోర్నకల్ : మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలోని రాజుతండాలో బుధవారం విద్యుత్ సిబ్బందితో కలిసి పర్యటించి సమస్యలను పరిశీలించారు. వీరన్న మాట్లాడుతూ వార్డుల్లో అవసరమైన ప్రాంతాల్లో స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.ఆయన వెంట సబ్ ఇంజనీర్ అరవింద్, లైన్‌ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు ఉన్నారు.

అలంకారప్రాయంగా మినీ సూపర్‌బజార్

గూడూరు: మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన మినీ సూపర్‌బజార్ షాపు అలంకారప్రాయంగా నిలిచింది. ఏడాదికాలంగా ఆ షాపు పరిధిలోని రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ షాపు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తి అనారోగ్యం బారిన పడడంతో ఈ షాపు బాధ్యతలను మండలంలోని కొల్లాపురం నిర్వహకుడికి అప్పగించారు. దీంతో అతనికి మరోషాపు బాధ్యతలు ఇచ్చారు. రెవెన్యూ శాఖ ద్వారా కొనసాగే రేషన్ షాపులకు ప్రభుత్వం సన్నబియ్యం అందించి పంపిణీ చేయిస్తుండగా, జీసీసీ మినీ సూపర్ బజార్‌లకు మాత్రం దొడ్డు బియ్యం వస్తున్నాయి. ఈ జీసీసీ షాపు ద్వారా రేషన్ సరుకులతో పాటు గిరిజనులకు ఎక్కువగా ఉపయోగపడే ముష్టి గింజలు, చిల్ల గింజలు, ఇప్ప పలుకులు, తొసి బంక, తీపి బంక విక్రయించే వారు. కానీ కరోనా పరిస్థితులు ఏర్పడిన కానుండి రేషన్ షాపుల్లో కానీ, జీసీసీ షాపుల్లో కానీ ఒక్క బియ్యం పంపిణీ తప్ప, మరే ఇతర వంట సామాగ్రి లభించడంలేదు. ఇదిలా ఉండగా రెవెన్యూ శాఖకు చెందిన షాపులో సన్నబియ్యం ఇస్తుండగా, మండల కేంద్రంలోని ఓ షాపు వద్ద లబ్ధిదారులు ఎగబడ్డారు. ఆ సమయంలో తనిఖీ కోసం వెళ్లిన తహసీల్దార్ అశోక్‌కుమార్‌తో జీసీసీ మినీ సూపర్ బజార్ తెరుచుకోవడం లేదని, ఆ షాపును ఎవరూ పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే జీసీసీ మినీ సూపర్‌బజార్ తెరిపించాలని ఆ షాపు పరిధిలోని లబ్ధిదారులు కోరుతున్నారు.



గూడూరులో రేషన్ షాపు తనిఖీకి వచ్చిన తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు

కాన్షీరాం స్ఫూర్తితో బహుజనరాజ్యం సాధిద్దాం

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అభినాయక్



మహబూబాబాద్ అర్బన్ : కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఎస్పీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం స్ఫూర్తితో బహుజనరాజ్యం సాధిద్దామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ అన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో కాన్షీరాం 89వ జయంతి సందర్భంగా మానుకోట అసెంబ్లీ అధ్యక్షుడు తోకల నాగరాజ్ అధ్యక్షతన జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగన్న, జిల్లా కార్యదర్శిలు ప్రసాద్ రావు, సోషల్ మీడియా హేమంత్, సాయికుమార్, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : కాన్షీరాం స్ఫూర్తితో బహుజన రాజ్యం సాధిద్దామని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ బహుజనులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపెల్లి ఉపేందర్ అధ్యక్షతన కాన్షీరాం జయంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి కేక్ కట్ చేసి నిర్వహించారు. అంతకు ముందే మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రసాద్ రావు, బుచ్చిరాములు, హేమంత్, నవీన్, స్వామి, శ్రీను, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి

బయ్యారం: పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనచైతన్యయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మండా రాజన్న పిలుపునిచ్చారు. జనచైతన్యయాత్ర జయప్రదం కోరుతూ ముద్రించిన పోస్టర్లను బుధవారం బయ్యారంలో ఆవిష్కరించారు. నాయకులు మోహన్, పెంటయ్య, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

దంతాలపల్లి : మండలకేంద్రంలో బధవారం సీపీఐఎం పార్టీ ఆధ్వర్యంలో జనచైతన్య వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మానుకోట జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాల వీరన్న మాట్లాడుతూ ఈ నెల 17 న మానుకోటలో జరుగబోయే జనచైతన్యయాత్రను అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎం మండల కార్యదర్శి బండి శ్రీను, నాయకులు గునుగంటి మోహన్, వీరభద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మిత్రుడి కుటుంబానికి చేయూత

తొర్రూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మిత్రుడి కుటుంబానికి సహచర ఉపాధ్యాయులు చేయూతనందించారు. నెల్లికుదురు మండలం కాచికల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ దర్గా హుస్సేన్, అతని భార్య అజీమాలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రస్తుతం అజీమా హైద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే రూ.40 లక్షల మేర చికిత్సకై ఖర్చు చేయగా ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. వారి పరిస్థితిని గుర్తించిన ఫ్రెండ్స్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.50 వేలు జమచేసి బుధవారం డివిజన్ కేంద్రంలో బాధిత కుటుంబీకులకు అందించారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక చేయూతనందిస్తామని ఎఫ్‌టీఏ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ప్రతినిధులు వెంకటేశ్వర్లు, యాకయ్య, భాస్కరాచారి, విజయ్, వెంకన్న, రంజాన్, సాయిప్రసాద్, వెంకటేశ్వర్లు, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తవేరా వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్ : తవేరా వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రం శివారులోని మున్నేరు వాగు బ్రిడ్జీ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దర్గాతండ గ్రామ పరిధిలోగల రేగడిగూడెంకు చెందిన పాయం సుధాకర్, నరసింహారావు గడ్డిగుడెంలో జరిగిన ఓ శుభ కార్యానికి వెళ్లి ఇంటికి బైక్‌పై వస్తున్నారు. కొత్తగూడ మండలంలోని లడాయిగడ్డకు చెందిన ఎనిమిది మందితో ఉన్న తవేరా సూర్యాపేట జిల్లా మిర్యాలగూడలో జరిగిన బొడ్రాయి పండుగకు హాజరై ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మున్నేరువాగు బ్రిడ్జీ వద్దకు తవేరా వాహనం రాగానే కుడి వైపున గల టైరు పంక్చర్ అయ్యింది. దీంతో ఆవాహనం అదుపుతప్పి వెళ్లి ఎదురుగా వస్తున్న సుధాకర్, నరసింహారావుల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికులు డయల్ 100 కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్ పీసీ పూల నరేష్ చేరుకుని వారిని 108 వాహనంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్ : స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న దోబీ ఉల్లోజు ఏసమ్మను గుర్తుతెలియని బైక్ బుధవారం రాత్రి ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఏసమ్మ రోజువారి పనిలో భాగంగా ఆస్పత్రికి వచ్చి ఆపరేషన్ థియేటర్‌లో బట్టలు ఇచ్చి ఇంటికి వెళ్తుంది. ఆస్పత్రి వెనుక గేటు నుంచి బయటకు వెళ్లి రోడ్డు దాటుతుండగా అతివేగంతో ఓ గుర్తు తెలియని బైక్ ఢీకొట్టగా ఏసమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

నెల్లికుదురు: పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాగబెల్లి సోమన్న, కృష్ణయ్య ఇద్దరు పనులమీద ఇండ్లకు తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగుల గొట్టి సోమన్న ఇంట్లో 5 గ్రాముల బంగారం, కృష్ణయ్య ఇంట్లో రూ.6500 వేలు నగదు అపహరించినట్లు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. లక్ష్మయ్య అనే రైతు తన రెండెకరాల గడ్డిని, మండల కేంద్రంలోని హరిహరగార్డెన్ ముందు వామిగా పేర్చాడు. గార్డెన్‌లో పనిచేస్తున్న లక్ష్మయ్య చెత్తా చెదారాన్ని కాలబెడుతుండగా చెత్తలో ఉన్న టపాసులు పేలి గడ్డివామిపై పడ్డాయి. దీంతో నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది నీళ్లు చల్లి మంటలను ఆర్పేశారు. అప్పటికే గడ్డిపూర్తిగా కాలిపోయింది.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన లారీ

డోర్నకల్: మన్నెగూడెం-ముల్కలపల్లి రహదారిలో ఓ లారీ మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..రావిగూడెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఓ ద్విచక్రవాహనం రోడ్డుపై వెళ్తున్న ఎడ్లబండిని ఢీకొట్టింది. సమాచారం తెలుసుకున్న మన్నెగూడెం, రావిగూడెంకు చెందిన కొంతమంది ఘటనా స్థలానికి వెళ్లి తమ ద్విచక్ర వాహనాలను రోడ్డు పక్కన నిలిపారు. ఇదే సమయంలో మహబూబాబాద్ నుంచి చెన్నైకు మిర్చి లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు ప్రక్కన నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. స్థానికులు లారీని ఆపి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను స్టేషన్‌కు సమాచారం అందించారు. దీనిపై సీఐ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఏడున్నర క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

మరిపెడ రూరల్ : మండలంలోని సోమ్లతండ గ్రామ పంచాయతీ పరిధిలోని బీమ్లాతండాలో తొర్రూరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఏడున్నర క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకుని, 50 లీటర్ల సారాయి, 100 కిలోల పటిక స్వాధీనం పర్చుకున్నట్లు తొర్రూర్ ఎక్సైజ్ ఎస్సై మధు బుధవారం తెలిపారు. మండలంలోని బీమ్లాతండాలో అధికారులు బుధవారం తెల్లవారు జామున దాడులు నిర్వహిస్తున్నారు. అశోక లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనంలో 15 బస్తాలు నల్ల బెల్లం, 50 లీటర్ల నాటు సారాయి, 100 కిలోల పటికను భూక్యతండాకు చెందిన భూక్య శ్రీరాములు, గోలితండాకు చెందిన లూనావత్ కోటేష్ అక్రమంగా తరలిస్తున్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్‌లు, మధుకర్, మజార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలకు ప్రింటింగ్ మిషన్ బహూకరణ

చిన్నగూడూరు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినుల కోసం విద్యార్థుల తల్లి దం డ్రులు ప్రింటింగ్ మిషన్‌ను బుధవారం బహూకరించారు. గత 4 ఏళ్లుగా విద్యార్థినులు జిరాక్స్ తీసుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లలిత లీల, ఉపాధ్యాయనీలు విద్యార్థినుల తల్లిదండ్రులకు వివరించారు. స్పందించిన 9వ తరగతి విద్యార్థినీ బానాల పుష్ప తల్లిదండ్రులు బానాల ఎల్లయ్య, శైలజ ప్రింటింగ్ మిషన్‌ను అందజేశారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి జీపీ కార్యాలయంలో బుధవారం కంటివెలుగు వైద్య శిబిరం కొనసాగింది. శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు నిర్వహించామన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మహబూబాబాద్ రూరల్ : ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ బేతమళ్ల రాజేష్ అన్నారు. మనవంతు సేవా సంస్థ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. వ్యవస్థాపక అధ్యక్షులు సూడి అనిల్ రెడ్డి మాట్లాడారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పంచమ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో ఈ నెల 19 వరకు పంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమోక్తంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఉదయం, సాయంత్రం బ్రహ్మోత్సవ ప్రత్యే పూజల అనంతరం రాత్రి 7.30 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

నెహ్రూసెంటర్ : రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఉద్యోగ నియామక పరీక్షపత్రాల లీకేజ్ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలెపాక వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం నిరసన తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి గద్దల శోభన్ బాబు 33 మంది విద్యార్థులకు హెచ్ఎం అల్లందాసు భిక్షపతి సమక్షంలో పరీక్ష సామగ్రి అందజేశాడు. అనంతరం అదే గ్రామంలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు సైతం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశాడు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

పెద్దవంగర: నిరుపేద దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి తెలిపారు. బుధవారం మండలంలోని వడ్డెకొత్తపల్లికి చెందిన పేద వికలాంగురాలు శివరాత్రి సుగుణమ్మకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎస్డీపీఓ కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన ఉమెన్ పీసీ మౌనిక కుటుంబానికి డీఎస్పీ రమణబాబు రూ.70వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు.ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మౌనిక దశదినకర్మ కార్యక్రమానికి పోలీసు అధికారులు హాజరయ్యారు. డీఎస్పీ రమణబాబు, బయ్యారం సీఐ బాలాజీ, గార్ల ఎస్సై బా నోత్ వెంకన్న హనుమకొండ వడ్డేపల్లిలో మౌనిక తండ్రి ఇంట్లో జరిగిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీఐని కలిసిన సేవాలాల్ సేన నాయకులు

మహబూబాబాద్ రూరల్ : మానుకోట రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బీ.రమేష్ ను సేవాలాల్ సేన మానుకోట జిల్లా కమిటీ బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్, జిల్లా అధ్యక్షులు గుగులోత్ నందులాల్ నాయక్, తదితరులు ఉన్నారు.

యువతకోసం కేసీఆర్ చేసిందేమి లేదు

మరిపెడ: తెలంగాణ సాధించిన యువత కోసం సీఎం కేసీఆర్ చేసిందేమి లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లెట్ కృష్ణనాయక్ అన్నారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని అన్నారు. ఉద్యోగ ప్రశ్న పత్రాల లీకేజీ విషయంలో టీఎస్‌పీఎస్సీ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయడంపై ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రశ్నపత్రాల లీకేజికి కారణమైన వారిని వదిలి పెట్టవద్దన్నారు.

నకిరేకల్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కురవి: నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భార్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిద్దాం

నెల్లికుదురు: బీజేపి ప్రభుత్వం చేపడుతున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలపై వ్యతిరేకిస్తూ ఈ నెల 17న జరిగే జన చైతన్యయాత్రకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబుగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక విశ్రాంతి భవనంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, రవి, వెంకన్న, సైదులు, ఐలయ్య, ముత్తిలింగం, యాకయ్య పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ ఏఈ పరీక్ష రద్దు చేయాలి

మహబూబాబాద్ : టీఎస్‌పీఎస్సీ ఏఈ పరీక్షను రద్దు చేయాలని తెలంగాణ (కాకతీయ) ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

పెద్దవంగర: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఎంఈఓగా ఐశు, ప్రధానోపాధ్యాయులుగా దుర్గ, పీఈటీగా రిషీ వ్యవహరించారు.

కేసముద్రం: ఇనుగుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా అలేఖ్య, ఎంఈఓగా అమూల్య, సర్పంచ్‌గా రవిప్రకాశ్, ఎస్ఎంసీ చైర్మన్‌గా సుకాంత్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో నోడల్ హెచ్ఎం రాజేందర్, హెచ్ఎం ఎం.వెంకటేశ్వరాచారి, ఎస్ఎంసీ చైర్మన్ భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.